www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 23 | డిసెంబర్ | 2024
పేజీలు 8

## అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



-రాజ్యాంగాన్ని గౌరవించని బిజెపికి పాలించే హక్కు లేదు
-అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రదర్శన
-అంబేద్కర్ సెంటర్ విగ్రహం ఎదుట నిరసన

2 లో

# ఒకే ఒక్కడు అయితేనేం..

-ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి
-అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం
-రైతులు, కార్మికులు, చిరుద్యోగుల గొంతుక





## ప్రజా గొంతుకగా కూనంనేని

**అధికారం రానప్పుడు ఒకరో ఇద్దరో గెలిచి ఏమి చేస్తారు. ఆ ఒక్కరిద్దరు మాత్రం గెలవకపోతే ఏం అనే వారికి ఇప్పుడు సరైన సమాధానం దొరికింది.** శాసన సభ అనగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం గత అవినీతిని తవ్వి తీసుకోవడం విమర్శలు, ప్రతి విమర్శలు, ఆర్థిక సంబంధ ఆరోపణలే అనే భావన పెరుగుతున్న నేపథ్యంలో ఓ గొంతుక శాసన సభ్యునిగా ఇలా ఉండాలి. శాసనసభలో ఇలా ప్రవర్తించాలి, శాసనసభలో ఈ అంశాలను లేవనెత్తాలి. శాసనసభలో ఎవరి పక్షాన ప్రశ్నించాలో, ఎవరి కొరకు తన పదవిని ఉపయోగించాలో పదవిని బాధ్యతగా భావిస్తూ జనం గొంతుకగా మారాడు. అతనొక్కడే అయితేనేమి కోట్ల మంది భావనకు, ఆలోచనలకు ప్రతిరూపంగా నిలుస్తున్నాడు. ఒకే ఒక్కడు అయితేనేం అతనో ప్రజా గొంతుక. ఆయనే కూనంనేని సాంబశివరావు. కొత్తగూడెం శాసనసభ నియోజక వర్గం నుంచి ఎన్నికై 119 మంది శాసన సభ్యులున్న సభలో భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన ఒక్కడుగా ఉన్న కూనంనేని ఇప్పుడు అందరి తలలో నాలుకయ్యాడు. రైతాంగ సమస్యయైన, కార్మికుల సమస్యయైన, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైనా, విద్యార్థులైనా మరెవరైనా వారి సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకుపోవడమే కాకుండా శాసనసభ వెలుపల కూడా పరిష్కార మార్గానికి ముందు నిలుస్తున్నాడు. సీనియర్ కమ్యూనిస్టులు సైతం మనవాడు శాసనసభలో ఉంటే ఇలా ఉంటుంది అనే ఒక సంతృప్తినిస్తున్నాడు. కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం ఇంకో నలుగురు కమ్యూనిస్టులు గెలిస్తే ప్రజా సమస్యలు మొత్తం ప్రభుత్వం దృష్టికి వచ్చి కొన్ని అయినా పరిష్కారానికి నోచుకునేవి కదా అనే భావనలో ఉన్నారు. మొత్తంగా ఒకే ఒక్కడు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తనదైన వాక్చాతుర్యం, సమస్యలను సభ దృష్టికి తీసుకు రావడమే కాదు వాటికి పరిష్కార మార్గం చూపడంలోనూ ఆయన ముందు వరుసలో ఉన్నాడు. ఒకప్పుడు చట్ట సభలలో ఎందరికో ఆదర్శంగా నిలిచిన కమ్యూనిస్టు యోధుల వారసుడిగా నిలిచాడు కూనంనేని...

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో





## నగరాభివృద్ధికి ప్రణాళికబద్ధ చర్యలు



-ఇండ్లు లేని నిరుపేదలకు సంక్రాంతి తర్వాత ఇండ్లు మంజూరు
-మంచినీటి సరఫరాకు రూ. 220 కోట్లు
-మున్నేరు రిటైనింగ్ వాల్స్‌కు నిపుణులతో కమిటీ
-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం:** ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలో మంచినీటి సరఫరా కొరకు అమృత్ పథకం ద్వారా రూ.220 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం 57వ డివిజన్ పరిధిలోని రమణగుట్టలో రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు, వాటర్ డ్రైన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని సంక్రాంతి నుంచి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని

మిగతా 2లో..

## చిక్కిపోతున్న సింగరేణి..!




-నేడు సింగరేణి డే
-ప్రైవేటు వైపుకు పరుగులు.. కార్పొరేట్ల కన్ను
-తగ్గిన కార్మిల సంఖ్య

**ప్రజాపక్షం/ఖమ్మం:** ఒకప్పుడు సిరుల తల్లి. లక్ష మంది కార్మికులకు ప్రత్యక్షంగా మరో లక్ష మందికి పరోక్షంగా జీవనోపాధిని చూపిన సింగరేణి ఇప్పుడు చిక్కిపోతుంది. ఒకప్పుడు అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా భాసిల్లిన సింగరేణి ఇప్పుడు కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లో చిక్కిపోనుంది. సింగరేణి మనుగడ ఇక ప్రశ్నార్థకం కానుంది. ఇప్పటికే బొగ్గు బ్లాకులను వేలం పాటల ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్న కేంద్రం భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా వ్యవహరించే అవకాశం ఉంది. దాదాపు 103 ఏళ్ల క్రితం ప్రారంభమైన సింగరేణి ప్రస్తానం దినదిన ప్రవర్ధమానమై ఆ తర్వాత క్రమేపి చారిత్రిక ప్రభను కోల్పోతూ వచ్చింది. ఇప్పుడు 40 వేల పైచిలుకు కార్మికులకు పరిమితమైంది. బొగ్గు బావులకు పుట్టినిల్లయిన ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇల్లందు ప్రాంతం ఇప్పుడు కార్మికుల సంఖ్య తగ్గి వెలవెలబోతుంది. సింగరేణి ఆవిర్భావం తదనంతర పరిణామాల్లోకి వెళితే ఇల్లందు ప్రాంతం మొత్తం దట్టమైన అడవులతో ఉండేది. భద్రాచలానికి వెళ్తున్న కొందరు భక్తులు ఇల్లందు అటవీ ప్రాంతంలో వంట చేసుకునేందుకు ఉపయోగించిన రాళ్లు మండటాన్ని గమనించి క్రిస్టియన్ మిషనరీ బాధ్యులకు తెలిపారు. వారు ఇంగ్లాండ్‌లోని ప్రభుత్వ అధికారులకు

మిగతా 2లో..

# ఒకే ఒక్కడు అయితేనేం..





కమ్యూనిస్టుల పోరాటాలతో పునీతమైన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తొలి ఎన్నికల్లో సిపిఐ, సిపిఎంలకు ప్రాతినిధ్యం లభించింది. కమ్యూనిస్టులు శాసనసభలో ఉంటే సమాధానం చెప్పాల్సి వస్తుందన్న అప్పటి అధికార పార్టీ బిఆర్ఎస్ కక్షపూరిత వైఖరి ధన బలం ముందు రెండవ దఫా కమ్యూనిస్టులకు శాసనసభలో ప్రాతినిధ్యం లభించ లేదు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడం కాంగ్రెస్ నుంచి గెలిచిన కొందరు పలాయనం చిత్తగించడం చివరకు బిఆర్ఎస్‌కు ఎదురు లేక అహంకారం పెరిగి అధికారం కోల్పోయింది. 2018 ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్ కమ్యూనిస్టులు రాకూడదనే భావనతోనే పని చేసింది. కాంగ్రెస్ మిత్రపక్షంగా కొత్తగూడెం నుంచి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శాసనసభకు పోటీ చేసి రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. ఏడాది కాలంగా శాసనసభలో, శాసనసభ బయట ఆయన వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. ముఖ్యంగా శాసన సభలో ఆయన మాట్లాడుతున్నప్పుడు సామాన్య ప్రజలు మొదలు ప్రతి ఒక్కరూ ఆలకిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు ప్రతి ఒక్కరికి ఇప్పుడు కూనంనేని ఆశా దీపంగా కనపడుతున్నాడు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం సామాన్యులకు సాధ్యం కాదు. ఇప్పుడు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య కూనంనేని వారధిగా మారాడు. నిర్మొహమాటంగా తప్పును తప్పు అంటూ ఒప్పును ఒప్పంటూ ఆయన ప్రసంగిస్తున్న తీరు ప్రశంసాపూర్వకంగా ఉంటుంది. శనివారం నాడు సభలో రైతుల గురించి ఆయన మాట్లాడిన మాటలు చర్చనీయాంశలవుతున్నాయి. అసలు వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోవడానికి కారకులు ఎవరు. అన్నదాత అంటూ అప్యాయంగా పిలుచుకునే రైతన్నను ఈ స్థితికి తెచ్చింది ఎవరు అంటూనే ఓట్ల వేట తప్ప నాట్లు గురించి తెలియని నేతలు పాలిస్తే రైతు పరిస్థితి ఈవిధంగానే ఉంటుంది. ఎన్నాళ్లైనా ఎన్నేళ్లయినా రైతు పరిస్థితి మెరుగు పడడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూనే కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాలు ఎంత ప్రమాదకరమైనవో శాసనసభ వేదికగా సమాజం దృష్టికి తీసుకు రావడంలో కూనంనేని తర్వాతే మరెవరైనా. సమస్య తెలుసుకోవడంలో ఆయన కనబరిచే ఆసక్తి దాని పరిష్కారం కోసం ఆయన చేసే ఆలోచన రెండు ఎల్లప్పుడు ప్రశంసనీయమే. సమస్య పరిష్కారానికి సాగిలపడవద్దు పరిష్కరించమందాం కాదంటే పోరాడదాం పోరాటమే మార్గమని చెబుతుంటారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన అనేకానేక పోరాటాలకు ఆయన నేతృత్వం వహించాడు. కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూనే వాటికి పరిష్కార మార్గాన్ని చూపుతూ కార్మికుల




కష్టాన్ని, ఉద్యోగంలో ఉన్న అభద్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడం శాసనసభ వేదికగా పరిష్కార మార్గాన్ని సూచించడం శాసన సభలో చూస్తున్నాం. ప్రభుత్వ సెక్టార్‌లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా దశాబ్దాల తరబడి పని చేస్తున్నా ఎదుగు బొదుగు లేని జీవితాలతో అవస్థలు పడుతున్న చిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసంఘటిత రంగంలో ఉండి చాలీచాలని వేతనాలు అవికూడా సరైన సమయానికి రాక ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన వర్కర్లు ఇంకా ఇతర రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇప్పుడు కూనంనేని ఒక వేదికగా మారాడు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన సింగరేణిని కష్టాల నుంచి గట్టేక్కించడానికి ఆయన చూపిన మార్గం కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరించాల్సిన తీరును చూపిన వైనం కార్మికుల గుండెల్లో సాంబశివరావును చిరస్థాయిగా నిలిపింది. వ్యవసాయ కార్మికులు ముఖ్యంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో వచ్చిన మార్పులు, ఇబ్బందులను శాసనసభలో, శాసనసభ వెలుపల కూడా ప్రస్తావించారు. ఓ శాసన సభ్యునిగా, భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు ప్రశంసలు అందుకుంటున్నారు. ఎంపిపిగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా మారిన కూనంనేని కొత్తగూడెం నుంచి రెండు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. 2009లో కొత్తగూడెం నుంచి ఎన్నికైన కూనంనేని 2023లో తిరిగి మళ్లీ ఎన్నికయ్యారు. విద్యార్థి దశ తర్వాత విశాలాంధ్రలో సబ్ ఎడిటర్‌గా ప్రారంభమైన ఆయన జీవితం కొత్తగూడెంలో విశాలాంధ్ర జర్నలిస్టు దాకా సాగింది. జర్నలిస్టుగా ఉంటూనే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కొత్తగూడెం పట్టణ సిపిఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్మిక ప్రాంతమైన కొత్తగూడెంలో కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చేపట్టిన పాదయాత్ర, అమరణ నిరాహారదీక్ష చేపట్టారు. అంతకు ముందు భూ సమస్యల పరిష్కారం కోరుతూ వారం రోజుల పాటు ఖమ్మం కేంద్రంలో అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ శాసన సభ్యుడు చట్ట సభలలో ప్రజల గొంతుకగా మారడం శుభ సూచికం. భవిష్యత్తులో మరింత మంది కమ్యూనిస్టులు గెలిస్తే మరింత బాగుంటుందన్న ప్రజల ఆలోచనకు అభివందనం.

-ప్రజాపక్షం/ఖమ్మం

# చిక్కిపోతున్న సింగరేణి..!

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేయడంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం విలియం కింగ్ అనే వ్యక్తిని పరిశోధన నిమిత్తం పంపింది. సుదీర్ఘ పరిశోధన అనంతరం 1889లో ఇప్పటి కారేపల్లి (సింగరేణి) తొలిసారి బొగ్గు తీయడం ప్రారంభమైంది. తొలుత దక్కన్ కంపెనీ పేరుతో బొగ్గు నిల్వలను వెలికి తీశారు. ఆ తర్వాత బెస్ట్ అండ్ కంపెనీకి అప్పగించారు. దీని కేంద్రం ఇంగ్లాండ్‌లో ఉండేది. 1927లో ఇంగ్లాండ్ నుంచి చెన్నైకు మార్చారు. అప్పుడు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా పేరు మార్చారు. అప్పటి నుంచి సింగరేణి విస్తరణ శరవేగంగా సాగింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్ నుండి ఖమ్మం వరకు పలు చోట్ల బొగ్గును వెలికితీశారు. సింగరేణి వ్యాప్తంగా 20 ఉపరితల గనులు, 24 భూగర్భ గనులు 11 ఏరియాల్లో ఉన్నాయి. ఇప్పుడు 43వేల మంది కార్మికులు, 2400 మంది అధికారులు పనిచేస్తున్నారు. యేటా 70 నుంచి 80 మిలియన్ల బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు బొగ్గు ఉత్పత్తి కార్మికుల జీవన ప్రమాణాలు, వేతనాలు వీటన్నింటికి మించి ప్రైవేటు భూతం సింగరేణిని వెంటాడుతుంది. అనేక కష్టానష్టాలకోర్చి సింగరేణి కార్మికుల మెడపై ప్రైవేటు కత్తి వేలాడుతుంది. అంబానీ, అదానీ సహా కార్పొరేట్ కంపెనీలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే ప్రయత్నం చేస్తుంది. దీనిని వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మిక సంఘాలు ఎంత ప్రయత్నం చేసినా ప్రైవేటీ కరణ వైపు నుంచి మోడీ సర్కార్ మనసు మార్చుకోలేక పోతుంది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగరేణిని ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచన రాగానే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అడ్డుతగిలింది. ఉత్పత్తిని పెంచి సింగరేణిని లాభాలబాట పట్టిస్తామని హామీ ఇచ్చి ప్రైవేటీకరణను నిలుపుదల చేయించి సింగరేణిని లాభాలబాట పట్టించింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారం అర్థం కాని లొగుట్టు, కేంద్ర ప్రభుత్వ దూకుడు వెరసి సింగరేణికి కొత్త బావులు లేకుండాపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న బావుల్లో నిల్వలు పూర్తయితే ఏమిటన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థను మళ్లీ బతికించేందుకు, పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు ఓ కృషి జరగాల్సి ఉంది. ఇప్పుడు కార్మికుల ముందు వేతనాలు, బోనస్‌లు కాకుండా సింగరేణి పరిరక్షణ ప్రధమ కర్తవ్యంగా మారాలి అప్పుడే వందేళ్ల సింగరేణికి మనుగడ. ఆవిర్భావ దినోత్సవ వేళ ఆ దిశగా అడుగులు వేయాలని ఆశిద్దాం.

# అమిత్ షాను బర్తరఫ్ చేయాలి




**ప్రజాపక్షం/ఖమ్మం:** భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పాత ధర్నాచౌక్ నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పక్షాల నేతలు మాట్లాడుతూ దేశంలో కులం, మతం, ప్రాంతం ఆధారంగా సమాజ మనుగడ ఉండరాదని అంబేడ్కర్ భావించారని మైనార్టీ వర్గాలకు రక్షణ కల్పించేవిధంగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. పేదలు, మైనార్టీలకు వరమైన అంబేడ్కర్ రాసిన రాజ్యాగం అమలవుతున్న దేశంలో రాజ్యాంగ నిర్మాతని కించపరిచిన బిజెపి నేతలు క్షమించరాని నేరం చేశారన్నారు. తక్షణం అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మతాన్ని అజెండాగా మార్చుకున్న బిజెపి రాజకీయ లబ్ది పొందెందుకు ప్రయత్నిస్తుందని ఆ క్రమంలోనే భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని నేతలు ఆరోపించారు. అమిత్‌షాను బర్తరఫ్ చేసేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు సివై పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు హుస్సేన్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, తాటి నిర్మల, సిపిఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, వై. విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి ప్రణాళికబద్ధ చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఖమ్మంలో జనాభా, పేదల సంఖ్యకు అనుగుణంగా ఇండ్లు మంజూరు చేయాలని కోరామన్నారు. రానున్న నాలుగేళ్లలో ఇండ్ల నిర్మాణం దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని సంక్షేమ పథకాలు అందని అర్హులు అధికారులను కలిసి వివరాలు తెలపాలన్నారు. నగరాన్ని వరద భారీ నుండి రక్షించడానికి రూ.250 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించి వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చేయడం జరుగుతుందన్నారు. మున్నేరుకు రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని ఇందుకు సంబంధించి ఒక కమిటీచే అంచనాలను తయారు చేస్తున్నామన్నారు. ఇటీవల వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ అంచనాలను రూపొందిస్తుందన్నారు. డంపింగ్ యార్డు విస్తరణ కోసం రూ. 1.15 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, స్లాటర్ హౌజ్ నిర్మాణానికి ఎనిమిది కోట్లు మంజూరు చేశామని తుమ్మల తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును నెహ్రూ జూలాజికల్ పార్కులాగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఖిల్లా వద్ద రూ. 20 కోట్లతో రోప్‌వేను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని డివిజన్లలో డ్రైన్లు, రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపిన తుమ్మల ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను అరికట్టాలని ఇందుకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు ఎండి రఫీదాబేగం, కమర్తపు మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదు

## -26న ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

## -సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా



**ప్రజాపక్షం/ఖమ్మం:** కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని, కమ్యూనిజమే సకల సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు శక్తులు పురోగమిస్తున్నాయని భారతదేశంలోని కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 26న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరగనున్న సిపిఐ శత వసంత సభ జయప్రదం కోరుతూ ఖమ్మం త్రీటౌన్ సుందరయ్య నగర్‌లో సిపిఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. భూక్యా రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జానిమియా మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద పాలన సాగుతుందని బిజెపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలను మరిచి పాలన సాగిస్తుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించే స్థితికి బిజెపి దిగజారిందన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడేది పోరాడుతున్నది కమ్యూనిస్టులే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో వెనకబడిందని తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. నగరంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని జానిమియా కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలాం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సభ 26న భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ నుంచి ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో సిపిఐ నాయకులు నూనె శశిధర్, బొల్లేపల్లి సత్యనారాయణ, నామా విజయ్‌కుమార్, షరీఫ్, నందు, యర్రా జనార్ధన్, చింతల పరమేష్, నాగబాబు, క్రాంతి, సాయి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అడ్డాలపై నిఘా

## -నగరంలో టాస్క్‌ఫోర్స్ దాడులు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నగరంలో గంజాయి, మాదకద్రవ్యల క్రయ, విక్రయాల అడ్డాలే లక్ష్యంగా గత రెండు రోజులుగా పోలీసుకమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపడుతున్నారు. రోటరీనగర్ ట్యాంక్ బండ్, గొల్లగూడెం, ఎస్‌బిఐటి ఇంజనిరింగ్, మమత మెడికల్ కళాశాలల పరిసరాలు, చర్చికాంపౌండ్, జహీర్‌పురా పార్క్, ఎన్‌టీఆర్ సర్కిల్, కొత్తబస్టాండ్, గట్టయ్య సెంటర్, సరితాక్లినిక్, ప్రకాష్ నగర్, సారధినగర్ అండర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ ఏసిపి రవి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవదని సూచించారు. గంజాయి సేవించే వారితో పాటు ఆయా ప్రాంతాల్లోని అడ్డాలపై నిఘా ఉంచి తరచూ దాడులు చేపడతామన్నారు. ఎవరైన పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువత గంజాయి బానిసలవుతున్నారని సేవించే వారిని ఉపేక్షించేదిలేదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికా, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. గంజాయి, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడివారి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# డిసెంబర్ 23ను వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించాలి



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి సంస్థ పుట్టిన రోజు డిసెంబర్ 23ను వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించాలని మణుగూరు హెచ్ఎంఎస్ యూ నియన్ వైస్ ప్రెసిడెంట్ కొడిపల్లి శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పదకత తో ముందుకు దూసుకు పోతున్న సంస్థ బొగ్గు ఉత్పత్తి లోనే కాకుండా విద్యుత్తు ఉత్పాదన రంగంలో కూడా ప్రవేశించి ధర్మల్ పవర్ స్టేషన్ ద్వారా అత్యధిక విద్యుత్ అందిస్తుందని, అలాగే సోలార్ విద్యుత్ ప్లాంట్ కుడాఏర్పాటు చేసుకున్నామని ఇంతటి ఘనతకు సింగరేణి కార్మికులే కారణం అన్నారు. ఇప్పుడు కొన్ని మెరుగైన వసతులు ఉన్నా గతంలో పెద్ద సౌకర్యాలు లేక పోయినా, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పనిచేశారని, కార్మికులు వారి కష్టం త్యాగాల ఫలితమే నేడు లాభాల బాటలో మన సింగరేణి నడుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంకు, సింగరేణి సంస్థ కు ఇంతటి కీర్తి ప్రతిష్టలను అందిస్తున్న మన కార్మికులకు సింగరేణి పుట్టిన రోజైన డిసెంబర్ 23న వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని, అలాగే ఇన్కమ్ ట్యాక్స్ రద్దు, కార్మికునికి సొంత ఇంటి పథకం, 200 గజాల స్థలం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మరియు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కని మరియు కోల్ బెల్ట్ ఏరియా మంత్రులను మరియు ఎంఎల్‌ఏ లను సింగరేణి సిఎండ్ఎండి బలరాం నాయక్‌ని, సింగరేణి యాజమాన్యానికి హెచ్ఎంఎస్ యూనియన్ తరుపున సింగరేణి కార్మికుల తరుపున విన్నవించుకుంటున్నానని ఆమె తెలిపారు.

# సింగరేణి సంస్థకు ఎనర్షియా అవార్డు లభించడం పట్ల హర్షం



ప్రజాపక్షం/మణుగూరు రూరల్: సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సారథ్య పాలనలో సింగరేణి సంస్థకు జాతీయస్థాయిలో అత్యుత్తమ పర్యావరణహిత మైనింగ్ మరియు సోలార్ ఉత్పాదక సంస్థగా ప్రతిష్టాత్మక ఎనర్షియా అవార్డు లభించడం పట్ల మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎనర్షియా 17వ పర్యావరణ మైనింగ్ మరియు సాంప్రదాయేతర ఇంధన వనరుల జాతీయస్థాయిలో ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టైనబుల్ కోల్ మైనింగ్ అండ్ ఆపరేషన్ విత్ రెన్యువబుల్ ఎనర్జీ అనే అవార్డు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ముందు రోజే సింగరేణి సంస్థకు లభించడం సియండి బలరాం అంకితభావ పనితీరుకు నిదర్శనం అని తెలిపారు. సింగరేణి ప్రగతి కోసం కష్టించి పని చేస్తున్న ప్రతి ఒక్కరికి మణుగూరు టిబిజికెయస్ తరుపున సింగరేణి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాయం పర్యటనను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఉదయం 9:30 గంటలకు పర్యటించనున్నారని మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు 102 అంబులెన్స్ వాహనం ప్రారంభోత్సవం, తాటిగూడెం గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభోత్సవం మరియు సమీక్ష సమావేశం కలదని, కావున మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు, పత్రిక మిత్రులు అభిమానులు తదితరులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

## -ఘనంగా బ్లూమింగ్ మైండ్స్ 14వ వార్షికోత్సవం






ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని కల్నల్ ఎస్‌కె భద్ర తెలిపారు. ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్నల్ ఎస్‌కె భద్ర, గౌరవ అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, కల్నల్ నవీన్ యాదవ్, మోటివేషనల్ స్పీకర్ వై. రామ కృష్ణ, పాఠశాల ఛైర్మన్ బి. సత్యనారాయణరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కల్నల్ ఎస్‌కె భద్ర, డిఈవో సోమశేఖర శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సెంట్రల్ సిలబస్ విద్యను అందించేందుకు బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలను ఏర్పాటు చేసి 14 ఏళ్లుగా విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనను అందించడం హర్షణీయమన్నారు. మోటివేషనల్ స్పీకర్ వై. రామకృష్ణ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ సువిశాలమైన ప్రాంగణంలో బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలను ఏర్పాటు చేసి 14 ఏళ్లుగా విద్యా బోధనను అందిస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనను అందించడమే గాక విద్యార్థులకు అన్ని రంగాలలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మొబైల్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. చదువు యొక్క ప్రాముఖ్య గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి. గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి. కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఓదార్పు స్ఫూర్తిదాయకం

## మణుగూరు ఏరియా జిఎం దుర్గం రాంచందర్ ప్రశంస



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియా సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఓదార్పు స్ఫూర్తిదాయకమని మణుగూరు ఏరియా జిఎం దుర్గం రాంచందర్ అన్నారు. శనివారం సాయంత్రం జిఎం కార్యాలయ ఆవరణలో జరిగిన ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ పొడుపు గంటి రమేష్ (45) కుటుంబానికి సహోద్యోగుల (ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు మరియు పర్మినెంట్ గార్డులు) ఒక లక్ష ఇరవై ఐదు వేల నాలుగు వందలు ఆర్థిక సహకారం రమేష్ సతీమణి సోమలక్ష్మి, కుమారులు శివకుమార్, సాయికుమార్ లకు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిరుద్యోగులైన పెద్ద మనసుతో తోటి వారికి సహాయ పడటం అనేది చక్కని మానవత్వం అని ఆయన ప్రైవేట్ సెక్యూరిటీ కార్డులను సింగరేణి సెక్యూరిటీ గార్డులను ఆయన అభినందించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. అదేవిధంగా తండ్రి చనిపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కెఆర్‌కె రాజు కు పదిహేను వేల ఎనిమిది వందలు మరియు కే రామకృష్ణ కు పదిహేను వేల రూపాయలు ముఖ్య అతిథి చేతులు మీదుగా వారి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ సతీమణి సోమలక్ష్మి మాట్లాడుతూ ఆపదలో ఆదుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన పెద్ద కుమారుడికి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా ఉపాధి కల్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తికి జీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ ఓ టు జి ఎం డి శ్యాంసుందర్, ఏరియా అధికార ప్రతినిధి సలగల రమేష్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు వై రామ్ గోపాల్, మేకల ఈశ్వర్, ప్రాతినిధ్య సంఘము నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, పిఏ రాంబాబు, విశ్వాస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు యస్‌డి నాసర్ పాషా, మంగీలాల్, జమేదారులు దశరథం, రాములు, బి జగన్ నాయక్, సూపర్వైజర్లు రామ్ అవతార్, డి సుధాకర్, షేక్ రబ్బాని, పి సుధీర్, వి శ్రీనివాస్, ఎన్ సుధాకర్, జె నరసింహారావు, ఏ ప్రవీణ్, పి వీరబాబు, కే సంతోష్, వి సాయిరాం, పి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

## -అఖిలపక్షం సమావేశంలో దండు ఆదినారాణ




ప్రజాపక్షం /సత్తుపల్లి : భారత పార్లమెంట్ సాక్షిగా భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షాను తక్షణమే భర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేశారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ. కాంగ్రెస్ పార్టీ పట్టణ అద్యక్షుడు గాదే చెన్నకేశవరావు అద్యక్షతన ఆదివారం అఖిలపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ బిజేపి భారతదేశంలో ఆర్ఎస్ఎస్ మనువాద మతోన్మాద సిద్ధాంతాన్ని అమలు చేసి దేశాన్ని విశ్చిన్నం చేస్తుందన్నారు. దేశ లౌకిక వాదాన్ని, రాజ్యాంగాన్ని, సార్వభౌమత్వాన్ని విచ్చినం చేసి ఒక దేశం, ఒక మతం, ఒక ఎన్నిక అనే పేరుతో దేశంలో గోడవలు సృష్టించాలని చూస్తుందన్నారు. దేశంలోని ప్రజలపై హిందూ మతాన్ని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తుందన్నారు. భారత రాజ్యాంగ పీఠికై ప్రమాణం చేసి వచ్చిన అమిత్‌షా అట్టి రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను విమిర్శంచడమంటే ,అంబేద్కర్‌పై దాడి చేయటం లాంటిదేనన్నారు. భారతదేశంలో విభిన్న జాతులు, కులాలు, మతాలు కలిగి భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశాన్ని ఒక మత వాద దేశంగా తయారుచేసి దేశంలో నియంతృత్వాన్ని ప్రవేశపెట్టి హిట్లర్ పాలన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. బిజేపి. ఆర్ఎస్ఎస్ కుట్రలను దేశ ప్రజలు గమనిస్తున్నారని సరైప సమయంలో ఓటు అనే ఆయుదంతో బుద్ధి చెప్తారన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అద్యక్షుడు గాదే చెన్నారావు, చల్లగుళ్ళ నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, సోమిరెడ్డి, సిపిఎం నాయకులు మోరంపూడి పాండు, సర్వేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, సిపిఐ నాయకులు తడికమళ్ళ యోబు, కూకలకుంట రవి, శరత్, సిపిఐ మహిళా సమైఖ్య డివిజన్ నాయకులు ఎస్‌కె రంజాన్‌బి,సిపిఐ మహిళా సమైఖ్య నాయకురాలు పాకాల ఝాన్సి, ఆటో యూనియన్ నాయకులు కేశవరావు, ఖమ్మంపాడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకెళ్తున్న బిఆర్‌టియు మిత్రపక్షాలు

## -ఆర్‌యూ, ప్రధాన ప్రతిపక్షం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న కార్మికులు
## -బదిలీలను మోసం చేస్తున్న ఆర్‌యూ నాయకులు
## -గత 13వేతన ఒప్పందాలలో కార్మికులకు అన్యాయం జరిగిందని ఆరోపణలు





ప్రజాపక్షం/బూర్గంపాడు: త్వరలో ఐటిసి భద్రాచలం యూనిట్‌లో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా బిఆర్‌టియూ మిత్రపక్షాల నాయకులు అన్నీ గ్రామాలు పూర్తి చేసుకొని చివరిగా ఆదివారం నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం మొదలుపెట్టారు. ప్రతి ఒక్క కార్మికుడి ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్మికులు ఉదయం నుండి పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారం జయప్రదం చేశారు. ప్రధాన ప్రతిపక్షం చేయలేని పనిని మూడో స్థానంలో ఉన్న బిఆర్‌టియూ మిత్రపక్షాలు చేస్తున్నాయి. మేము గెలిస్తే కార్మికులకు వంద శాతం మెడికల్ స్కీమ్ వర్తింపజేస్తామని మిని మ్యానిఫెస్టోకి సంబంధించిన కరపత్రాలు అందజేశారు. గత పద మూడు వేతన ఒప్పందాల్లో కార్మికులకు జరిగిన అన్యాయం గురించి స్వయంగా కార్మిక కుటుంబాలు చర్చించు కుంటున్నాయని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికలలో మూడో స్థానంలో ఉన్న బిఆర్‌టియూ మిత్రపక్షాలకు ఓటు వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గత నలభై నాలుగు సంవత్సరాల కంపెనీ చరిత్రలో ఆరుసార్లు టిఎన్‌టియూసి, ఏడు సార్లు ఐఎన్‌టియుసి యూనియన్లు ఆధిపత్య పోరు, బలనిరూపణ తప్ప కార్మికులకు సంబంధించిన చిన్నపాటి మౌళిక స్థితిని కూడా బాగు పర్చలేకపోయాయని, ముఖ్యంగా మెడికల్ స్కీమ్‌కు సంబంధించి మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నా, చితక మార్పులు చేస్తున్నారే తప్ప, కార్మిక కుటుంబాలకు మెడికల్ భరోసా ఇవ్వకపోవడం ఇరు సంఘాల అసమర్థతకు నిదర్శమని తెలుపుతున్నారు. వీరు చేసిన డొల్ల మెడికల్ స్కీమ్ అని కార్మికులకు ఇప్పటికే గ్రహించారన్నారు. నాణ్యమైన విద్యను అందించే క్రమంలో స్కూల్‌నీ సమూల ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు సాధించి తీరుతామని అన్నారు. ప్రస్తుత బదిలీలకు భవిష్యత్తులో జరగబోవు రిక్రూట్‌మెంట్ నందు సీనియారిటీకి ప్రాతినిధ్యం ఇస్తూ. ఎటువంటి షరతులు, ఖర్చులు లేకండా నిష్పక్షపాతంగా బదిలీ కార్మికులకు పర్మినుంట్‌ను సాధిస్తామని, ఎంతో కాలంగా ఎదురు చేస్తున్న ఈ 3 గ్రేడ్ క్వార్టర్స్ కోరుకున్న ప్రతి కార్మికుడికి సాధించి తీరుతామని తెలిపారు. కార్మికుల ప్రమోషన్ పాలసీని ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఎమోషన్ పాలసీకి స్వస్తి పలుకుతూ. ప్రతి కార్మికుడు భవిష్యత్‌లో గ్రేడ్ టైమ్‌ను నష్టపోకుండా టైమ్ బాండ్ పాలసీని సాధించి తీరుతామని అన్నారు. ఈకార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రచారం చేశారు.

# సోషియాలజీలో సాంబశివరావుకు డాక్టరేట్

## ఇందిరమ్మ ఇల్లు, బతుకుదెరువుకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి







ప్రజాపక్షం/మణుగూరు రూరల్: కేయూ సోషియాలజీ విభాగం పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సాంబశివరావుకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి ప్రకటించారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టర్స్ ఆఫ్ డిసబులిటీ స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ ఏ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య ప్రోత్సాహంతో పి.హెచ్ డి పూర్తి చేసి, సాంబశివరావు పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని కురు గ్రామం బాపన కుంట ప్రాంతానికి చెందిన పుట్టు దివ్యాంగుడైన సాంబశివరావు కూలి నాలి చేసుకుంటే కానీ కూడు దొరకని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తల్లితండ్రులు వెంకటయ్య కనకమ్మ లకు నవంబర్ 1986వ సంవత్సరంలో జన్మించాడు. ఇతనికి ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య, ముగ్గురు వివాహితులే. తల్లి తండ్రి వ్యవసాయం, పశువుల కాపరులుగా పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుట్టు వికలాంగుడైన సాంబశివరావు కర్ర సాయంతో తనకు చదువు మీద మక్కుతో స్థానిక చైతన్య విద్యాలయంలో ఉన్నత విద్యను (మెట్రిక్యులేషన్), ఇంటర్ డిగ్రీ శ్రీవిద్య కాలేజీలో 2008 సంవత్సరంలో పూర్తి చేశాడు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు, తినడానికి తిండి, ఆరోగ్య సమస్యలు వెనువెంటనే వెంటాడుతుండడంతో చదువుకు ఆరు సంవత్సరాలు దూరమై తిరిగి 2014 లో చిన్ననాటి మిత్రుడు దాసరి గోపాలకృష్ణ ప్రోత్సాహంతో, అసోసియేట్ ప్రొఫెసర్ కుంట ఐలయ్య సహకారంతో కాకతీయ యూనివర్సిటీలో సోషయాలజీ పీజీ కోర్సు పూర్తి చేయడం జరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు తమ్మిశెట్టి సాంబశివరావు. అదే యూనివర్సిటీలో వికలాంగుల అసోసియేషన్‌లో అధ్యక్షులుగా ఎన్నికై పలు సేవలు అందించారు. ప్రస్తుతం పీహెచ్ డీ తమ్మిశెట్టి సాంబశివరావు కుటుంబం నేటికీ దీన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఉండడానికి ఇల్లు లేక కుటుంబ పోషణ భారమై, తీవ్ర మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు, వృద్ధులు, కూలి పనులు చేయలేని పరిస్థితి, చేతికి అందొచ్చిన కొడుకు వికలాంగుడు కావడం, తల్లిదండ్రులు తన కొడుకుని చూస్తూ బాధాతప్త హృదయాలతో కాలం వెళ్ళదిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ్మిశెట్టి సాంబశివరావుకు ఇందిరమ్మ ఇల్లును అదేవిధంగా సాంబశివరావుకు అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్థానికులు పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాధపురం, నల్లమూడి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతుగా వృద్ధులకు చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్యా దుప్పలను అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ కిన్నెర రాజశేఖర్, సీతాయిగూడెం మాజీ సర్పంచ్ కారం సుధీర్ తదితరులు ఉన్నారు.



# స్వామియే శరణం అయ్యప్ప



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం లో అయ్యప్ప స్వామి భక్తుల ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు కొడవటిగంటి శివయ్య ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షను పూర్తి చేశారు. ఇరుముడి ని శబరిమల లో అయ్యప్ప సన్నిదానంలో అందించేందుకు ఆదివారం ఇరుముడి కార్యక్రమం ను నిర్వహించారు. దేవాలయంలో అయ్యప్ప నామస్మరణంలో మారుమోగింది. మాలధారణ భక్తులు ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలదారణ భక్తులు పాలడుగు పూర్ణచందర్, కె.అఖిలశర్మ, కె.హసినీ లతో పాటు జిల్లా టీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు కాసాని నాగేశ్వరరావు, వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు పోలంపల్లి నాగేశ్వరరావు, తుమ్మా ఉపేందర్, మల్లేల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి విద్యాలయం విద్యార్థులకు జిల్లాస్థాయి బహుమతులు



ప్రజాపక్షం/కామేపల్లి: కామేపల్లి గీతాంజలి విద్యాలయం విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఖమ్మం గురు దక్షిణ ఫౌండేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి 20242025 సైన్స్ క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన పదవ తరగతి విద్యార్థిని షేక్ సల్మా ఇన్సియా 9వ తరగతి విద్యార్థి నాగు బండి లక్ష్మీ నరసింహలను ఆదివారం గీతాంజలి విద్యాలయంలో కరస్పాండెంట్ అమిరినేని దయానంద్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈసందర్భంగా అమిరినేని దయానంద్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో తమ పాఠశాలకు పేరు తీసుకొచ్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించే విధంగా తర్ఫీదు ఇస్తామని చెప్పారు. మరిన్ని అంశాల్లో జిల్లా స్థాయి పోటీలతో పాటు విద్యలో తమ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచే విధంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

# గణేష్ చిత్ర పటానికి నివాళి




ప్రజాపక్షం/ సత్తుపల్లి : మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తోట గణేష్ హైద్రాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో గణేష్ చిత్ర పటానికి మున్సిపాలిటీ చైర్మన్ కూసంపూడి మహేష్, కమీషనర్ రవిలు గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్ళులర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించారు. చిన్న వయస్సులోనే గణేష్ మృతి చెందటం బాధాకరమన్నారు. నివాళ్ళులర్పించిన వారిలో కౌన్సిలర్‌లు చాంద్‌పాషా, నరుకుళ్ళ శ్రీనివాసరావు, మున్సిపాలిటి సిబ్బంది తదితరులున్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన జర్నలిస్టులు



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గొల్లపూడి గ్రామంలో జర్నలిస్ట్ షేక్ సుభాని మేనల్లుడు వివాహ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు నూతన దంపతులైన మహమ్మద్ రఫి, జరీనాను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో తాండ్ర రమేష్, సూతకాని ప్రేమ్‌చంద్, గొల్లమందల విజయ్, పులి కృష్ణార్జున్‌రావు, సూతకాని శ్రీకాంత్, పోశం శ్యామ్ పాల్గొన్నారు.

# విద్య నేర్పిన గురువును, విద్యాలయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి



ప్రజాపక్షం/పాల్వంచ: సమాజంలో ఉన్న స్థానానికి ఎదిగేలా చేసిన, విద్య నేర్పిన గురువును, విద్యనభ్యసించిన విద్యాలయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామా పరిధిలోని జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దని ఘనత పాల్వంచ కళాశాలకే దక్కిందన్నారు. విద్య నేర్పిన గురువును దైవంలా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పసుపులేటి శంకర్, తహసీల్దార్ వివేక్, డీఐఈవో హెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రణాళికాధికారి సంజీవరావు, మాజీ జెడ్‌పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టరట్ జీ యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 వసంతాల వేడుక

## -హాజరైన శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు







**ప్రజాపక్షం/పాల్వంచ:** ప్రభుత్వ జూనియర్ కళాశాల 50వ వసంతాల వేడుకలు మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి పంచాయితీలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులకు మంచి సందేశం ఇచ్చారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో స్వర్ణోత్సవములకు హాజరు కావడం, కళాశాల పూర్వ విద్యార్థులందరికీ శుభాభినందనలు తెలిపారు. కళాశాలకు అవసరమైన ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణం తన వంతుగా కృషి చేసి అతి త్వరలోనే పూర్వ వైభవం తీసుకొస్తానని తెలిపారు. అనంతరం అధికారులు శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సిహెచ్ వెంకటేశ్వరరావు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ సీతారాములు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు ఇట్టి వెంకట్రావ్, శనగరాపు శ్రీనివాసరావు, నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, రంగారావు, భూక్యా విజయ్, హరి, సత్యనారాయణ, వైఎస్ గిరి, ఎస్‌ఏ రెహమాన్, జకరయ్య, సత్యనారాయణ, కీరం, ఎస్‌కే లాల్ పాషా, ఆదినారాయణ, స్వవట్ వెంకటరమణ, పూర్వపు ప్రిన్సిపాల్ విజయ పూర్ణిమ, రామచందర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసికోల్లాసం



**ప్రజాపక్షం/పాల్వంచ:** క్రీడలతోనే దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసం ఏర్పడుతాయని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కేటిపిఎస్ బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో హర్ష, ప్రణీత్ మెమోరియల్ ఆధ్వర్యంలో 12వ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ టోర్నీని నిర్వహించారు. ఆదివారం ఈ టోర్నీని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం, నడకలతో పాటు ఆటలాడటం ద్వారా మనస్సుకు ఆరోగ్యమైన ప్రశాంతత చేకూరుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, మెమోరియల్ నిర్వాహకులు కటిక శ్రీనివాస్, నాని, హిమ వరుణ్, విజయ్, మన్సూర్, నాగరాజు, ఉప్పుశెట్టి రాకేష్, సురేష్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై రాజ్యాంగంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రస్తావించడం పట్ల సిపిఎం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వేరువేరుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు ఆధ్వర్యంలోఅమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలపగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలని, హోం మంత్రిగా అమిత్ షాను భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు పొట్లపల్లి వెంకటేశ్వరరావు, చిమట విశ్వనాథం, ఎస్‌ఎఫ్ఐజిల్లా నాయకులు బెజవాడ సాయి శేషు, కాంగ్రెస్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కేసరి శ్రీనివాసరెడ్డి, మిట్టపల్లి కిరణ్, గోదాచెన్నారావు, మాల్లోతు రాధాకృష్ణ, మేక తొట్టి కాంతయ్య, కాకావెంకటేశ్వరరావు, కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బంజారా సమ్మేళనంలో ఒక్కటైన సారపాక లంబాడీలు

## -లోకల్ ముద్దు బయటి వాళ్ళు వద్దు అని ప్రకటన





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకలోని రాజుతండా, గాంధీనగర్, విజయనగర్, భాస్కర్‌నగర్, శ్రీరాంపురం, మసీదు రోడ్డు, బసప్ప క్యాంప్, ముత్యాలమ్మపేట, అన్ని కాలనీలోని లంబాడి ప్రజలు ఎకమై గ్రామం మొత్తంగా వున్న సుమారు 4వేల మంది లంబాడీలు పాల్గొని బంజారా సమ్మేళన కార్యక్రమాన్ని పుష్కరవనం దగ్గర సమ్మక్క సారలమ్మ గద్దెల దగ్గర పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈకార్యక్రమంలో మొదట గాంధీనగర్ సేవాలాల్ మందిరం నుండి పూజా నిర్వహించారు. భాస్కర్‌నగర్ నుండి ముత్యాలమ్మ గుడి వరకు యువకులు భారీ సంఖ్యలో మోటార్ సైకిల్ ర్యాలీ చేశారు. తర్వాత అందరు ఐటిసి బిపిఎల్ స్కూల్ దగ్గరకు చేరుకొని ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాష్ట్ర టీచర్స్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్‌ను, సారపాక మాజీ సర్పంచ్ ధారావత్ చందు నాయక్‌ను, సేవాలాల్ సేన నాయకులు అజ్మీర వెంకన్న, జర్పుల భద్రును ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీగా వేదికకు లంబాడీ సాంస్కృతిక ఆటపాటలతో చేరుకున్నారు. అజ్మీర రాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ సారపాక గ్రామంలో సుమారుగా 30 సంవత్సరాలుగా సర్పంచ్‌గా కొనసాగిన ధరావత్ రాజు(లేటు), ధరావత్ చందునాయక్ సేవలను కొనియాడారు. లంబాడీ జాతి 850 సంవత్సరాల చరిత్ర గల జాతి అని అన్నారు. అనంతరం స్థానిక పెద్దలు రాంజీ, బర్మావత్ కిషన్, భూక్య నంద్యలు మాట్లాడుతూ అందరు కలిసి మెలిసి వుండి స్థానికులనే గెలిపించుకోవాలని, బయటి వాళ్ళు వద్దు అన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ ధారావత్ చందు నాయక్ మాట్లాడుతూ సారపాక గ్రామంకు గ్రామం నుండి ఈ రోజున అంచెలు అంచెలుగా జనాభా పెరిగి ధరావత్ రాజు సారధ్యంలో అనేక కాలనీలు, కులాలకు, మతాలకు అతీతంగా స్థలాలు పంచి ఇటు రాజీవ్‌నగర్ నుండి అటు తాళ్ళగొమ్మూరు వరకు ఈ గ్రామంలో 80శాతం ఇళ్ళు కట్టుకునేలా చేసి అనేక కష్టనష్టాలను ఓర్చి అందంగా తీర్చిదిద్దారని, ఈ గ్రామాన్ని తిరిగి అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రజలు 10సంవత్సరాలు తనను సర్పంచ్‌గా ఎన్నుకొని ఒంటి చేత్తో గెలిపించాలని అన్నారు. ప్రజలకు పని చేసి రుణం తీర్చుకున్నాను అని, సారపాక ప్రజలు లంబాడీల పట్ల సహృదయంతో వున్నారని, మనం కూడా గ్రామంలోని అన్ని కులాల వారిని కలుపుకొని, గ్రామాభివృద్ధికి పాటు పడుతూ లంబాడీల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలు, ఐటిడిఎలను ఉపయోగించుకోవాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు చెడు పనులకు దూరంగా ఉండి, ఉన్నత చదువులు చదివి గ్రామంలో అందరు గర్వపడేలా ముందుకు సాగాలని అన్నారు. ఈకార్యక్రమంలో జర్పుల భద్రునాయక్, సపావత్ జగన్, రాంబాబు, రఘు, శివ, సురేష్ నాయక్, ఎసే, విక్రమ్, భూక్య రాజ బాబు, శ్యామ్, గుగులోత్ వెంకన్న, సమీర్, భూక్య లక్ష్మణ్, వివిధ డిపార్ట్‌మెంట్ నుండి లంబాడీ అధికారులు, టీచర్లు భీమా, మాజీ ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో లంబాడీలు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/సుజాతనగర్:** నిషేధిత గంజాయిని సుజాతనగర్ ఎస్ఐ మాలోత్ రమాదేవి ఆధ్వర్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ గ్రామంలో ధనలక్ష్మి వెంచర్ వద్ద ఆదివారం పట్టుకున్నారు. వారి వద్ద నుండి సుమారు రూ. 45,525/లు విలువ గల 1,821 కేజీల గంజాయిని, ఒక స్కోడా కారు, ఒక హోండా స్కూటీ, 7 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంచుల సమక్షంలో తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్, సీఐ ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రమాదేవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేసినా, సేవించినా అలాంటి వారి పట్ల పోలీస్‌లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె చంద్రశేఖర్, ఎన్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణితశాస్త్ర దినోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** అరుణోదయ మెరిట్ స్కూల్ నందు శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకల సందర్భంగా అంబరాన్ని అంటాయి. మ్యాథమెటిక్స్ డే సంబరాలు ఎన్నడూ జరగని విధంగా అందరినీ అబ్బురపరిచే రీతిలో పాఠశాలలో మ్యాథ్స్ డే వేడుక కనువిందు చేశాయి. విద్యార్థులందరూ మ్యాథ్స్ కు సంబంధించి చాట్స్, ప్రాజెక్ట్ వర్క్స్, డ్రాయింగ్స్ చూపరులకు అబ్బురపరిచాయి. శ్రీనివాస రామానుజన్‌ని ఉద్దేశించి ఎస్సై రైటింగ్ రాసి విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచారు. ఏడీఎంఎస్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించగా విద్యార్థులందరూ గెలుపే ధ్యేయంగా ఒకరిని మించి ఒకరు సమాధానాలు చెబుతూ ఉత్కంఠ నెలకొల్పారు. శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్ట్ ను నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులలో ప్రథమ బహుమతి పొందిన వై. శ్వేత చంద్ర కు టెన్త్ క్లాస్ క్లాస్ టీచర్ రంజిత్ సార్ ప్రైజ్ మనీ రూ.500 ఇవ్వడం జరిగింది. అన్ని కాంపిటీషన్స్ లో గెలుపొందిన వారికి గణిత శాస్త్ర ఉపాధ్యాయ బృందం మరియు మేనేజ్ మెంట్ వారు బహుమతులు బహూకరించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు అందరినీ విద్యార్థులు పుష్పగుచ్ఛం మరియు శాలువాతో సత్కరించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు వారి వారి అనుభవాలను మ్యాథ్స్ డే ప్రత్యేకతను తెలియజేశారు. అరుణోదయ మెరిట్ స్కూల్ డైరెక్టర్ అయిన బి. శంకర్, వి.శ్రీను, ప్రిన్సిపాల్ నేతాజీ ప్రసాద్ తదితరులు మ్యాథ్స్ డే గురించి జరిగిన విధివిధానాల గురించి మాట్లాడుతూ సంతోషం వ్యక్తపరిచారు.

# అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

## -అఖిల పక్షాల ఆధ్వర్యంలో నిరసన, ప్రదర్శన




**ప్రజాపక్షం/బోనకల్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, ప్రజాతంత్ర వాదులు మండల కేంద్రంలో నిరసన, ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, కిలారి సురేష్‌లు మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక కులానికో, ఒక మతానికో, ఒక ప్రాంతానికో, ఒక భాషాకో ప్రతినిధికాదని ఆయన ఒక విశ్వమానవుడని అన్నారు. అంబేద్కర్..అంబేద్కర్..అంబేద్కర్ అనే కంటే ఏ దేవుడిని తలచిన ఏడు జన్మలకు స్వర్గప్రాప్తి కలుగుతుందని అనే వ్యాఖ్యలు బిజెపి మతోన్మాదానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ అనే పదాన్ని అమిత్‌షా చులకన మాట్లాడడం సబబు కాదని అన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు గుగులోత్ రమేష్, సీఐటీయూ మండల కన్వీనర్ బోయిన పల్లి వీరబాబు, తెల్లాకుల శ్రీనివాసరావు, పిల్లలమర్రి అప్పారావు, మరీదు శ్రీను, బిల్లా విశ్వనాథం, గుంపుల జయరాజు, ఉప్పర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మినహాయింపు లేకుండా రుణమాఫీ పూర్తి చేయాలి



## నేడు కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/వైరా:** ఎలాంటి మినహాయింపు లేకుండా రూ.2లక్షలు రుణమాఫీ పూర్తి చేయాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్23న సోమవారం ఉదయం 10గంటలకు ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రుణమాఫీ కోసం రైతు ధర్నా జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి రైతు రుణమాఫి ఖమ్మం జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా పూర్తి కాలేదు అని అన్నారు. మూడు విడతలుగా జరిగిన రుణమాఫి తర్వాత 31ర కాల టెక్నికల్ సమస్యలతో రుణమాఫి కాలేదని ప్రకటించిన ప్రభుత్వం కేవలం రేషన్‌కార్డు లేని రైతు కుటుంబం నిర్ధారణ చేసి వారికి మాత్రమే నాల్గో విడత రుణమాఫి జాబితాలో పేర్ల విడుదల చేశారని, ఇతర సమస్యలు పరిష్కారం చేయకుండా రుణమాఫి పూర్తి చేయడం సాధ్యం కాదని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఎలాంటి మినహాయింపు లేకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యనమద్ది రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాజేంద్ర, రాజేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

## అఖిలపక్షం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/వైరా:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జున్‌రావు, కాంగ్రేస్ వైరా మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్, కాంగ్రేస్ పార్టీల ఆధ్వర్యంలో భారత పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్‌చేయాలని డిమాండ్ చేస్తూ వైరా రింగు రోడ్డు సెంటర్‌లో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని సవరించాలని, మను ధర్మాన్ని అమలు చేయాలని బిజెపి ప్రయత్నిసుతందని, రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను బిజెపి కాళరాస్తుందని, ఆదాని, అంబానిలకు ఊడిగం చేస్తూ కార్పొరేట్ సేవలో బిజెపి మునిగిపోయిందని విమర్శించారు. ప్రజా సమస్యల ఏజెండాను పక్కదారి పట్టించే విధంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ కులమతాల మధ్య కొట్లాటలు సృష్టిస్తూ దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం పైన ప్రమాణం చేసి పదవి అనుభవిస్తూ అలాంటి గొప్ప మహానుభావుడిని అవమానించడం, అవహేళన చేయడం బిజెపి కుటిల రాజనీతికి నిదర్శనం అన్నారు.ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను లౌకిక ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. మతోన్మాదుల నుండి రాజ్యాంగాన్ని దేశాన్ని రక్షించుకోవాలని దేశ ప్రజల మనో భావాలను దెబ్బతీసే విధంఅ వ్యాఖ్యలు చేస్తూ విద్వేషాలకు కారుకుడైన అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి యలదండి బాబు, కాంగ్రేస్ నాయకులు పొదిల హరినాథ్, సిపిఐ నాయకులు గారపాటి అశోక్, సిపిఎం వైరా డివిజన్ కమిటీ సభ్యులు తూము సుధాకర్, తోట నాగేశ్వరరావు, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, పారుపల్లి కృష్ణారావు, గుడిమెట్ల రజిత, బాజోజు రమణ, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, షేక్ నాగుల్‌పాషా, అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గణిత దినోత్సవం






**ప్రజాపక్షం/వైరా:** శ్రీనివాసరామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకొని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈస ందర్భంగా పాఠశాల కరస్పొండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలను అలంకరించి రామానుజన్ ప్రతిభను కొనియాడారు. విద్యార్థులు రామానుజన్ నెంబర్ 1729 గుఇంచి అతడు కనుగొన్న థీరమ్స్, ఫార్ములు కొన్నింటిని వివరించి ఆకట్టుకున్నారు. మ్యాథ్స్ మ్యాజిక్ సాంగ్, సాలిడ్ సేప్స్ డ్యాన్స్, మ్యాథ్స్ యాక్టివిటీలో భాగంగా క్యూబ్‌ను ఉపయోగించి ప్రతివైపు ఒకే కలర్ వచ్చేలా ఏర్పాటుచేయడం,ప్రైమరీ విద్యార్థులు ప్రదర్శించిన టేపదర్శించిన డ్యాన్స్, ఆటపాటలతో మ్యాథ్స్ నేర్పించడం, ప్లేకార్డులు ఉపయోగించి నెంబర్ల యొక్క ప్రాధాన్యతను వివరించే తీరు అద్భుతంగా ఉంది. దాంతో పాటుగా మ్యాథ్స్ క్విజ్‌ని ఏర్పాటు చేసి బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పొండెంట్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ ప్రపంచం గర్వించదగ్గ మేధావి అని, 15 ఏళ్ల వయస్సులోనే పెద్ద పెద్ద ప్రొఫెసర్లకే సాధ్యంకాని ఆల్జీబ్రాబ, అనలైటికల్ జామెట్రి సిద్ధాంతాలను ఎలాంటి పుస్తకాలు లేకుండా కనుగొన్నారని, ప్రతి ఆవిష్కరణలో గణితం నిర్దష్టమై ఉంటుందని, నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు పరిష్కారం గణితమని, వేగం, ఖచ్చితత్వం రెండు గణితానికి మూల స్థంభాలని అటువంటి గణితాన్ని, గణిత మేధావిని స్పూర్తిగా తీసుకొని మిమ్మల్ని మీరు తీర్చిదిద్దువాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైరా గ్రేట్‌విజన్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా డిస్ట్రిక్ట్ జిఎస్టి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, జెడ్‌సి వుంద్రు వరలక్ష్మి ఆర్థిక సహాయంతో సుమారు 50 మంది వృద్ధులకు నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. వైరాకి చెందిన మోదుగు రత్నకుమారి, వి.రాజేశ్వరి అనే ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అజీమ్‌కు వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలోనే లాగానే ఈ సంవత్సరం కూడా క్రిస్మస్ పండుగను ప్రజలు అందరు సుఖసంతోషాలతో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజెస్ లగపాటి ప్రభాకర్‌రావు, మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కౌన్సిలర్ డాక్టర్ కోటయ్య, డాక్టర్ రవిచంద్ర, గంగవరపు కిసన్, జాలా పుల్లారావు, వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి , రమేష్, వెంకటేశ్వరరావు, రాంగోపాల్, ఉపేంద్ర, నాగేశ్వరరావు, గద్దె నీరజ, ఎంబిబిఎస్ విద్యార్థి వుంద్రు అజయ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని రూ.80లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈస ందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమమే పార్టీ ధ్యేయంగా పనిచేస్తుందని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతు రుణమాఫీ, రైతు భరోసా లాంటి కార్యక్రమాలతో భూ భారతి అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కనివిని ఎరగని రీతిలో సిసి రోడ్లు గాని, బిటి రోడ్లు గాని, కొన్ని కోట్లలో శాంక్షన్ చేపించి వర్కులు చేయించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, తెల్లారి చంద్రప్రకాష్, మంగీలాల్, స్వర్ణ నరేందర్, వైరా పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, నరవనేని అశోక్, మట్టూరు వెంకటేశ్వరరావు, పొదిలి హరినాథ్, ఫణితి శ్రీను, ఇటుకల మురళి, చప్పిడి వెంకటేశ్వర్లు, జవ్వాజి నాగరాజు, మట్టూరి కృష్ణారావు, పాలేటి నర్సింహారావు, తేలూరు వీరయ్య, కొప్పురావూరి శబరినాథ్, షేక్ సైదా, సూరంపల్లి రామారావు, పెద్దప్రోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షుడిగా ఖాజా బాబా



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడిగా షేక్ ఖాజా బాబా రెండో సారి ఎన్నికయ్యారు. యూనియన్ కొత్త కమిటీలను జోనల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిహెచ్. శంకర్‌రావు ప్రకటించారు. సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శిగా పి.రవీందర్, అధ్యక్షుడిగా షేక్ ఖాజాబాబా, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులుగా చిలుకస్వామి, శ్రీనివాస్, నాగలక్ష్మి , రమేష్‌కుమార్, జోనల్ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, నవనీత్ సింగ్ ఎన్నికయ్యారు. ఖాజా బాబా బిడిసిఆర్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తూ అంచెలంచెలుగా బ్రాంచ్ సెక్రటరీగా, డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా, డివిజనల్ ప్రెసిడెంవగా తిరిగిరెండోసారి డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా మజ్దూర్ యూనియన్ భద్రాచలం బ్రాంచ్ వారి తరపున ఖానా బాబాను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఖాజా బాబా మాట్లాడుతూ అధినాయకత్వం నన్ను గుర్తించి రెండోసారి డివిజనల్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అదేవిధంగా బ్రాంచ్‌లో చురుగ్గా పనిచేస్తూనా వెన్నంటే ఉన్నటువంటి ఉద్యోగస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# మహిళలకు రక్షణ కల్పించాలి




**ప్రజాపక్షం/పెనుబల్లి:** స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పెనుబల్లి మండల కమిటీ సమావేశం మాదాసు నాగేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి మాట్లాడుతూ మహిళలకు రక్షణ చట్టాలు చేయాలని, హక్కుల రక్షణ కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ద్వారా అనేక పోరాటాలు చేయడానికి సన్నద్ధం అవుతున్నామని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ, వాటి అమల్లో పాలకులు అనుసరిస్తున్న విధానాలు ఇబ్బందికరంగా ఉన్నాయని, మహిళలపై జరుగుతున్న కృత్యాలను ఎండగట్టాలని, పెనుబల్లి మండలంలో విస్తారంగా గ్రామ కమిటీలు వేస్తామని, జనవరి సంక్రాంతికి మహిళల్లో పోటీ తత్వాన్ని లేపడం కోసం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తామని, మండల కమిటీలో వేద సమస్యల పైన చర్చించామని అన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకులు ఎం. లక్ష్మి , విజయ కుమారి, వసుంధర, జి.లక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# సమస్యలపై స్పందించే సిపిఐకే ప్రజా మద్దతు

-కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని
-కూనంనేని సమక్షంలో పలు కుటుంబాలు సిపిఐలో చేరిక





ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్‌: కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి అనునిత్యం శ్రమిస్తున్న సిపిఐకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పాత కొత్తగూడెం ఏరియా 2,3,4 వార్డులకు చెందిన 60 కుటుంబాల వారు విద్యానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని సమక్షంలో చేరారు. వీరికి ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎర్ర జెండావైపు ఆకర్షితులవుతున్నారని, దీనిని చిరస్థాయిగా నిలుపుకుంటామని అన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు ప్రజాక్షేత్రంలో పనిచేయాలని, ప్రజల్లో మమేకమైతేనే పార్టీకి మరింత ఆదరణ పెరుగుతుందని అన్నారు. భవాని, నాగేంద్ర, మందా గణేష్, నరేష్ తదితరులు నేతృత్వంలో 60 కుటుంబాల వారు సిపిఐలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారు ప్రసాద్, కొండా స్వామి, యాంద్ర మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలిపై దాడి చేసిన దుండగులను అతి త్వరలో గుర్తిస్తాం

-అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు
-అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పల్లె పకృతి వనం



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంతో పాటు ఖమ్మం జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామం ఇప్పుడు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది గత ప్రభుత్వంలో గ్రామంలోని పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయగా ప్రస్తుత ప్రభుత్వంలో అది అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా నిలిచింది. గ్రామాలో కొంతమంది యువకులు సాయంత్రం కాగానే పల్లె ప్రకృతి వనంలో గంజాయి మద్యం సేవిస్తూ అర్ధరాత్రి వరకు అందులోనే గడుపుతూ గ్రామ ప్రజలంతా నిద్ర అవస్థలో ఉండగా నిర్మాణస్య ప్రాంతాలు ఒంటరి మహిళలు వృద్ధులను టార్గెట్ గా చేసుకొని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ నడిబొడ్డులో ఆరెంపల వెంకమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటున్నది గమనించి కొందరు దుండగులు అర్ధరాత్రి బండరాయితో ఆ మొఖంపై గట్టిగా గాయపరిచి మెడలో ఉన్న బంగారు గొలుసును దిండుకుందున్న కొంత నగదును చోరీచేసిన సంఘటన తెలిసింది. ఈ విషయంపై స్థానిక పోలీసులు క్లోజ్ టీం పోలీస్ జాగిలాలతో నిందితులను గుర్తించేందుకు అన్ని కోణాల్లో అన్వేషిస్తున్నారు. ఆదివారం శాంతి భద్రతల పరిరక్షణ అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు వెంకమ్మ నివాసాన్ని సందర్శించి జరిగిన చోరీ గురించి అడిగి తెలుసుకున్నారు. పక్కన ఉన్న ఇంటి చుట్టు ప్రక్కల వారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంకమ్మ పై దాడి చేసి నగదు నగలను చోరీచేసిన వారిని అతి త్వరలో గుర్తిస్తామని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. పిండిప్రోలు గ్రామంలో కొందరు యువకులు మద్యానికి గంజాయి కి పేకాటకు అలవాటు పడి అసంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని వారికి కొంతమంది పిండిప్రోలు గ్రామస్తులు రాజకీయ లబ్ధి కోసం వారికి ఆద్యం పోస్తున్నారని సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో దుండగులకు స్థావరం కల్పిస్తే ఎప్పటికైనా సమాజానికి తీరని మచ్చ వస్తుందని అలాంటి వారి పట్ల వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. మండల పంచాయతీరాజ్ అభివృద్ధి అధికారి గ్రామాల్లో పల్లె పకృతి వనాల సంరక్షణతో పాటు వాటికి తాళాలు ఏర్పాటు చేయాలని, వాటి పరిరక్షణకు పంచాయతీ కార్యదర్శి కి బాధ్యతలు అప్పగించి రాత్రి సమయంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్యవేక్షణగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని దీనికి గ్రామస్తులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రజా ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట కూసుమంచి సర్కిల్ సిఐ సంజీవ్ తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో మారనున్న రిజర్వేషన్లు

ప్రజాపక్షం/ఖమ్మం : స్థానిక సంస్థల సమరానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. 2018 పంచాయతీరాజ్ చట్టానికి కొన్ని సవరణలు చేసింది. ముఖ్యంగా చట్టంలో పొందుపర్చిన విధంగా స్థానిక సంస్థలకు ఒక రిజర్వేషన్ రెండు పర్యాయాలు వర్తించే పద్ధతికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తిపలికింది. పంచాయతీ, ఎంపిటిసి, జెడ్పిటిసి సహా స్థానిక సంస్థలన్నింటికి ఒక రిజర్వేషన్ ఒకే దఫా వర్తించనుంది. దీనితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు మారనున్నాయి. పంచాయతీ ఎన్నికలకు ఇప్పటికే కాలపరిమితి ముగిసి 11 నెలలు గడిచిన నేపథ్యంలో త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే ఓటరు జాబితాలను తయారు చేసి బహిర్గతపరిచింది. సవరణలను కూడా దాదాపుగా పూర్తి చేసింది. ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా అధికారులు సేకరించారు. రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలను




నిర్వహించడమే తరువాయి. మారనున్న రిజర్వేషన్లు కొంత మంది ఔత్సాహికులను నిరాశ పరిచి మరి కొంత మందికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. శాసన మండలిలో బిల్లు ఆమోదం తర్వాత స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పుడు రిజర్వేషన్ల కొరకు ఎదురు చూస్తున్నారు.

## శీలం అప్పారావు కుమార్తెకు ఆశీర్వాదం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని అప్పలనరసింహపురం గ్రామానికి చెందిన సిపిఐ (ఎం) మండల నాయకులు శీలం అప్పారావు కుమార్తె వివాహ ప్రధానానికి పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, మందడపు మురళీకృష్ణ, మారుతి కొండలరావు, అమరబోయిన బిక్షమయ్య, షేక్ మహబూబ్, దుగ్గి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత సిద్ధ వైద్య శిబిరం ప్రారంభం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం గుండెపుడి గ్రామం నందు సిద్ధ వైద్య వారు ఎటువంటి ఆపరేషన్ మెడిసిన్ లేకుండా చక్రసిద్ధ్ లో చికిత్స చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు లేళ్ల వెంకటరెడ్డి, జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలోత్ మంగీలాల్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో గుండెపుడి గ్రామం నందు ఏర్పాటుచేసిన ఉచిత సిద్ధ వైద్య శిబిరాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ రోజుల్లో మారుతున్న వైద్య విధానాలకు అనుగుణంగా ప్రజలకు మంచి వైద్యాన్ని అందించాలని సంతోషం చక్ర సిద్ధుతో ఎటువంటి ఆపరేషన్ మెడిసిన్ లేకుండా వైద్యం అందించడం చాలా శుభ పరిణామం అని చెబుతూ యాజమాన్యానికి నా ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బత్తుల రాజేష్ కుటుంబానికి అండగా ఉంటాం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ బచ్చల కోయగూడెం గ్రామానికి చెందిన బత్తుల అబ్బయ్య కుమారుడు బత్తుల రాజేష్ గత కొంతకాలం క్రితం మరణించగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు వారి స్వగృహానికి వెళ్లి రాజేష్ మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీలు బియ్యం మరియు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధర్మరాజుల వెంకటనారాయణ, భుక్యా అమ్రు నాయక్, నిమ్మటూరి ముత్తయ్య, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి గూగులోత్ శ్రీనివాస రావు, ధర్మరాజుల సత్యనారాయణ, నునావత్ మోహన్ నాయక్, అక్కుల నాగరాజు, నిమ్మటూరి కనకయ్య, మడి రవీ, నరుకుళ్ళ ఆదినారాయణ, బాదావత్ రమేష్, కుదురుపాక సోమయ్య, బానోత్ మంగ్యా నాయక్, బలుగూరి కేశవరావు, జబ్బా రామనాథం, మద్దిశెట్టి వంశీ, పూరేటి తిరుపతిరావు, నిమ్మటూరి లచ్చయ్య, బాదావత్ నరేష్, బత్తుల రవి, కోటయ్య, తాళ్లూరి తిరుపతి, వినేయ్, మడి కృష్ణయ్య, కోరం కృష్ణయ్య, బత్తుల శ్రీను, ఎట్టి శివ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: లక్ష్మీ దేవి పల్లి మండ లం కారుకొండ ఉమ్మడి పంచాయతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తూము చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలోనే అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు అందేలా చూస్తామని తెలిపారు. గిరిజన రైతులను కాపాడుకుంటామని రైతు రుణమాఫి కానివారు ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదబాబు, సొసైటీ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్, పూణెం శ్రీనివాస్, డిసిసి జిల్లా మైనార్టీ కార్యదర్శి గౌస్, మాజీ సర్పంచ్ బలరాం, గుండ్ల రవి, కొర్ర మంగయ్య,ఏనుగుల వెంగళరావు, మాచర్ల శ్రీను, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వీరయ్య మృతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన మారగాని వీరయ్య (బాబాయ్) (75) గుండెపోటు తో ఆదివారం మృతి చెందాడు. మృతుడు గత 40 ఏళ్ల గా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ...అందరితో కలిసిమెలిసి ఉండేవారు. రాజకీయాలకు అతీతంగా, అధికారులు సైతం ప్రతీ ఒక్కరూ బాబాయ్ గా పిలిచేవారు. వీరయ్య కంటే కూడ తనను బాబాయ్ అని అడ్రస్సు అడిగితేనే తెలుస్తుందంటే అశ్చర్యం కలగకమానదు. ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు స్థానిక కంతమహేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ గా పని చేశారు. ఇటు కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేపట్టారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలిచారు. ఆయన మృతి వార్త తెలుసుకుని వివిధ పార్టీల నాయకులు మృతదేహం ను సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యకమంలో గౌడసంఘాల జేఏసీ వైస్ చైర్మన్ అమరగాని వెంకన్న, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, గీత కార్మిక సంఘం నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, మార్కెట్ సెక్యూరిటీ గార్డ సంఘం రాష్ట్ర నాయకులు మారగాని వీరబాబు, కాంగ్రెస్ నాయకులు కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.